క్లుప్తంగా

చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలి

అంబాజీపేట: చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వీఎస్‌వీ.మహాలక్ష్మి, ఎన్.వెరినమ్మలు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం గురువారం మూడో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల పోషణతో పాటు విద్యపై మక్కువ పెంచేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు జరపాలన్నారు. డీఆర్పీలు సీహెచ్.వెంకటసతీష్, బీఆర్ఎస్.శ్రీనివాస్, డీఎస్.రమేష్‌లు శిక్షణ ఇచ్చారు.

గిరిజా కుమారికి సత్కారం



గిరిజా కుమారిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన సన్నవిల్లి, నంగవరం ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారిని గురువారం అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు సత్కరించారు. సన్నవిల్లిలోని గిరిజాకుమారి నివాసంలో ఆమెను రమణారావు ఘనంగా సత్కరించారు. ఆమెను సత్కరించిన వారిలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి పినిపే జయరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు నేలపూడి సుగంధ కుమార్, గంటా లక్ష్మీ ప్రసాద్, పందిరి సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

దొంతికుర్రు మాజీ సర్పంచి మృతి



కొప్పిశెట్టి దుర్గాలక్ష్మి

కాట్రేనికోన: దొంతికుర్రు మాజీ సర్పంచి కొప్పిశెట్టి దుర్గాలక్ష్మి (65) గుండెపోటుతో గురువారం అకస్మికంగా మృతి చెందారు. 2006 నుంచి 2012 వరకు ఈమె దొంతికుర్రు సర్పంచిగా పని చేశారు. అంత్యక్రియలను శుక్రవారం గౌతమీ గోదావరీ పాయ శ్మశాన వాటికలో నిర్వహిస్తారు. పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఆమె భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

మోటార్ సైకిల్ స్వాధీనం

తాళ్లరేవు: బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ నిర్వహించిన దాడుల్లో 9 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై ఎంవీవీబీ కుమార్ గురువారం తెలిపారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి దొరబాబు 9 మద్యం సీసాలను బైక్‌పై తరలిస్తుండగా పట్టుకుని మద్యంతో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇతనిని తాళ్లరేవు ఎస్సైకు అప్పగించినట్లు చెప్పారు.

పశు సంచార వాహన ఉద్యోగుల ధర్నా



కలెక్టర్‌వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: పశు సంచార వాహన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. 2022 నుంచి విధులు నిర్వర్తిస్తున్న తమను ఇప్పుడు అర్ధాంతరంగా తొలగించడం దారుణమని వాపోయారు. చాలీచాలని జీతాలతో విధులను నెట్టుకొస్తున్న తమను అక్రమంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన



చెత్త నుంచి సంపద సృష్టిపై డ్వాక్రా సంఘాల లీడర్లకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ వాణిశ్రీ

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల అధ్యక్షులకు గురువారం గ్రామాల్లో పెరుగిపోతున్న చెత్త ద్వారా సంపద సృష్టిపై ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహర అవగాహన కల్పించారు. గ్రామాల్లో పెరిగిపోతున్న చెత్తను ఒక చోటకు చేర్చాలన్నారు. అక్కడి నుంచి పోగుపడిన చెత్త నుంచి తడి, పొడి చెత్త వేరు చేయలన్నారు. తడి చెత్తను డీకంపోజ్ చేసి సేంద్రియ ఎరువుగా మార్చి మొక్కలకు, పంటలకు ఉపయోగించేలా శిక్షణ నిచ్చారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

అమ్మ భాష... అమృత జలపాతం


- ఆంగ్లం మోజులో మాతృభాష మృగ్యం
- సమష్టి కృషితో పూర్వ వైభవం
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

యానాం: 'మాతృభాష కన్న మధురమేదీ..కన్నతల్లి కన్న ఘనమైనదేదీ?.. తెలుపుమయ్య నీవు తెలుగు బిడ్డ' అంటారు ప్రముఖ రచయిత నార్ల చిరంజీవి. మాతృభాష కన్నా మధురమైనది సృష్టిలో వేరొకటి లేదన్నది నిర్వివాదాంశం. శిశువు తల్లి ఒడిలో పాలు తాగుతూనే మాతృభాషను నేర్వడం సృష్టిలో గొప్ప అనిర్వచనీయ అనుభూతి. అలాంటి మాతృభాషను పాశ్చాత్య మోజులో పడి నేటితరం విస్మరించడం ఆందోళనకు గురిచేసే అంశంగా పరిణమిస్తోంది.

ఆంగ్లమోజుతో పెనుముప్పు

ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో మాతృభాష ఉనికి ఆందోళనను కలిగిస్తోందని పలువురు సాహితీ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంగ్లం మోజులో మాతృభాషను విస్మరించటం బాధాకరమని అంటున్నారు. తల్లిదండ్రులు సైతం ఆంగ్ల భాషా బోధనవైపే మొగ్గు చూపడంతో అమ్మభాష ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. తెలుగును విద్యాలయాల్లో పరభాషలా చూడటంతో భాష అంతరించి పోతుందనే ఆందోళన ప్రారంభమయ్యింది. ఐక్య రాజ్యసమితికి చెందిన యునెస్కో వెలువరించిన 'ది అట్లాస్ ఆఫ్ డేంజర్ అండ్ డిసెప్పియరింగ్ లాంగ్వేజెస్' నివేదిక భారత్‌లో రెండో అతి పెద్దదైన తెలుగు భాష 2035 నాటికి అంతరించి పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో మాతృభాషలు అంతరించే స్థితిలో ఉన్నాయి. ఆంగ్లభాష అనే రోడ్డురోలర్ కింద పడి ఇప్పటికే బక్క చిక్కిన మాతృభాషలు కనుమరుగై పోయాయని యునెస్కో వెల్లడించింది.

సాంస్కృతిక, భాషా వైవిధ్యం ప్రాముఖ్యతను ప్రోత్సహించేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుతున్నారు. దేశవిభజన తర్వాత బంగ్లాదేశ్‌లో మాతృభాష కోసం నలుగురు బెంగాలీ యువకులు ప్రాణాలర్పించారు. ఈ కారణంగానే ఫిబ్రవరి 21న ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది దీనిని జరుపుతున్నారు.



తెలుగు అక్షరాలు

మాతృభాషతోనే ప్రగతి



సమాజం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. అయితే భాషలు మాత్రం అంతరించిపోతున్నాయి. భాష అంతరించిందంటే ఆ భాష మాట్లాడే సమూహం అంతరించినట్లే భావించాలి. నిజమైన భావ ప్రేరణ, ప్రగతి మాతృభాషతోనే సాధ్యం.

డాక్టర్ శిఖామణి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు, యానాం.

మాతృభాషా బోధనతో మనోవికాసం



మాతృభాషలో విద్యాబోధనతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. తల్లిదండ్రులు ఆంగ్లంతో పాటు మాతృభాషను గౌరవించాలి. తెలుగు నేర్పడం చిన్నతనంగా భావించకూడదు. మనో భావాలు మాతృభాష ద్వారా స్పష్టంగా అర్థమవుతాయి.

దాట్ల దేవదానం రాజు, ప్రముఖ కవి, యానాం.

ఘనంగా వీరభద్రుని సంబరం



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర మాఘమాసం సందర్భంగా పి.మల్లవరంలో వీరభద్రుని సంబరాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కాట్నం శ్రీనివాసరావు, మౌనిక దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పంటకాలువ వద్ద పవిత్ర స్నానాలాచరింపజేసి అనంతరం గ్రామంలో వీరభద్రులను డప్పు వాయిద్యాలు, వీరముష్టుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, విళ్ల సత్యనారాయణ, ధూళిపూడి సుబ్బారావు, ధూళిపూడి శుభ, కాట్నం కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిమ్స్ చైర్మన్‌కు మాతృ వియోగం

అమలాపురం రూరల్: కిమ్స్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు మాతృమూర్తి కలిదిండి లక్ష్మీకాంతం (87) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఈమె మృతి పట్ల ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంతాపం వ్యక్తం చేశారు. కిమ్స్ కళాశాలకు వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. పలువురు చైతన్య రాజును పరామర్శించారు.

మహా శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేద్దాం

- దేవాదాయ శాఖ డీసీ రమేష్‌బాబు
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

ఐ.పోలవరం: మహా శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నారు. గురువారం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అధికారులు, అర్చకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీసీ మాట్లాడుతూ.. ఇక్కడ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు దేశం లోనే ప్రాధాన్యత ఉందన్నారు. మహా శివరాత్రి పర్వదినం రోజు ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం, చివరిరోజు గోదావరి మాతకు పంచ హారతులు, తెప్పోత్సవం కార్యక్రమాలకు ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఈఓ మాచిరాజు లక్ష్మీ నారాయణకు సూచనలు చేశారు. తొలుత డీసీ రమేష్‌బాబు, ఏసీ సత్యనారాయణ, తనిఖీ అధికారి రామలింగేశ్వరావులు వీరేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సత్యసీతారామశర్మ, పేటేటి శ్యామల కుమార్, పండితులు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, నాగాభట్ల శ్రీరామ్ శర్మ, ఆలయ సిబ్బంది ఉన్నారు.



వీరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

డీఎస్పీని కలిసిన శెటిబలిజ సంఘీయులు

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలకు డిమాండు

అమలాపురం టౌన్: శెట్టి బలిజ కులాన్ని, కులం మహిళలను సోషల్ మీడియా ద్వారా అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమలాపురం డీఎస్పీ, పట్టణ సీఐలకు శెట్టిబలిజ సంఘాల నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు కార్యాలయాలకు శెట్టిబలిజ సంఘాల నాయకులు వెళ్లి అసభ్యకరంగా మాట్లాడిన వారి పేర్లు, ఫోను నెంబర్లు, చిరునామాలు లిఖిత పూర్వకంగా అందజేశారు. ఆరుగురు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా శెట్టి బలిజ మహిళలపై అసభ్యకరంగా మాట్లాడారని వీడియో ఆధారాలను పోలీసు అధికారులకు అందించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఆ ఆరుగురు వ్యక్తులపైనే కాక ఆ పోస్టులకు లైకులు, కామెంట్స్ పెట్టిన వారిపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సామాజిక వర్గ నేతలు చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని, కుడుపూడి బాబు, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, భరత్ భూషణ్, చిట్టూరి పెదబాబు, చెల్లుబోయిన నాని, విత్తనాల శేఖర్, దంగేటి రుద్ర, కముజు రమణ, దొంగ చిన్నా తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.



డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న శెట్టి బలిజ సంఘాల నేతలు

బ్రేక్ సిస్టం టెక్నాలజీపై ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన

అమలాపురం రూరల్: బస్సుల్లో బ్రేక్ సిస్టం టెక్నాలజీపై ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల ప్రజా రవాణా అధికారి ఎం. శ్రీనివాసరావు సూచించారు. గురువారం అమలాపురం డిపో ఆవరణలో ట్రైనింగ్ స్కూల్‌లో నూతనంగా బస్సులలో బీఎస్ 6 టెక్నాలజీ బ్రేక్ సిస్టం నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులకు కోనసీమ జిల్లా నాలుగు డిపోల నుంచి, కాకినాడ జిల్లా మూడు డిపోల నుంచి బ్రేక్ మెకానిక్స్, సూపర్వైజర్లు, ఎలక్ట్రీషియన్లు హాజరై శిక్షణ పొందారు. అమలాపురం డిపోలో ప్రతినెల డ్రైవర్ హ్యాపీనెస్ వీక్ నిర్వహించడం వల్ల డ్రైవర్లలో నమ్మకం ఏర్పడి మెరుగైన డ్రైవింగ్ అందిస్తున్నారని, రోడ్ టెస్ట్‌లు నిర్వహించడం వలన బస్సుల కండిషన్ మెరుగు పడుతుందని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఎం సత్యనారాయణమూర్తి

ఏపీఎంపై చర్యలకు డిమాండు

కాట్రేనికోన: రామస్వామి తోట వీఓఏను కక్షపూరితంగా విధుల్లో నుంచి తొలగించిన కాట్రేనికోన ఏపీఎం శ్రీనివాసరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగు పీడీకి వినతి పత్రం అందించారు. రాజకీయ కక్షతో ఏపీఓ ఏకపక్షంగా వ్యవహరిస్తూ సభ్యుల తీర్మానం లేకుండా వీఓఏ గిడ్ల జ్ఞాన కుమారిని తొలగించారని ఆరోపించారు. నాయకులు కాశి మునికుమారి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, పాలెపు ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, గంటి వెంకట సుధాకర్ తదితరులు ఉన్నారు.

సాకుర్రు జెడ్పీ పాఠశాల తనిఖీ

అమలాపురం రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కే సలీం బాషా ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ మండలం సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా ఏపీవో భీమారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పరీక్షలకు సమయం తక్కువ ఉన్నందున మరింత చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉపాధ్యాయులు పల్లంరాజు, దొరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



రామ మందిరంలో చండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో 22వ రోజు చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి వెలగ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ పాల్గొన్నారు. అర్చకులు వేదాశీర్వచనం అందించి సౌరయాగ విశిష్టతను వివరించారు.

జ్ఞానజ్యోతి శిక్షణను వినియోగించుకోవాలి

కాట్రేనికోన: మండలంలో చెయ్యేరు జెడ్పీహెచ్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అందిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులకు గురవారం ముమ్మిడివరం సీడీపీఓ విమల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూపర్‌వైజర్ తులసి అధ్యక్షతన జరుగుతున్న శిక్షణ తరగతులకు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎంఈఓ-2 వెంకటరమణ హాజరై మాట్లాడారు. సీడీపీఓ విమల మాట్లాడుతూ శిక్షణ పొందిన అంగన్ వాడీ కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో అమలు చేసి చిన్నారులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచలం, హెచ్ఎం శేషసాయి, సూపర్ వైజరు రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ విమల

వైభవంగా తిరుప్పావడ సేవ



చింతలూరులో స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ద్వితీయ వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం నాడు వైష్ణవాలయాల్లో అత్యంత ప్రముఖంగా జరిపే తిరుప్పావడ (అన్న కూటోత్సవం) సేవను వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోకుల వాసులందరినీ ప్రకృతి వైపరీత్యం నుంచి రక్షించి, వారందరికీ ఆకలి బాధలు లేకుండా పోషించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ వైష్ణవాలయాల్లో ఈ తిరుప్పావడ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సేవలో భాగంగా సుమారు 200 కేజీల పులిహోరను స్వామి వారి ఎదురుగా రాశిగా పోసి, నివేదన చేసిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. తిరుప్పావడ సేవను దర్శించడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు.

కన్నుల పండువగా హనుమద్ వాహన సేవ

ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు హనుమద్ వాహనంపై ఆసీనులై స్వామివారు శ్రీరాముని అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. హనుమద్ వాహనంపై స్వామివారు విహరిస్తుంటే భక్తులు తిలకించారు. భక్తులకు భారీ అన్నసమారాధన జరిగింది.

విద్యార్థిని సుప్రియకు సత్కారం



సుప్రియను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: తమిళనాడు సాంకేతిక బోర్డు పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని నేరెళ్ల సుప్రియను గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సత్కరించారు. విద్యార్థిని 700 మార్కులకు గానూ 698 మార్కులు సాధించి తమిళనాడు బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని కళాశాలల్లోని విద్యార్థుల కన్నా అత్యధిక మార్కులు తెచ్చుకుని ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ పి వేలాయుధం, హెచ్ఓడీ చంద్రశేఖరన్, ఈసీఈ హెడ్ నాగఅజ్మీరా తెలిపారు. ఆర్ఏఓ మునిస్వామి సైతం సుప్రియను సత్కరించారు.

సీఎం డిజిటలైజేషన్ సర్టిఫికెట్ల అందజేత

యానాం: ప్రధానమంత్రి మత్స్యకిసాన్ సమృద్ధి యోజన పథకానికి సంబంధించి మత్స్యకారులకు గురువారం డిజిటలైజేషన్ సర్టిఫికెట్లను ఆర్ఏఓ మునిస్వామి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి మత్స్యశాఖ ద్వారా అమలు జరుగుతున్న ఈ కార్యక్రమం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తాళ్లరేవు: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీలో నిలిచిన అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లి బాలకృష్ణ తదితరులు ఓట్ ఫర్ సుందర్ స్లోగన్‌తో ప్రచారం చేశారు.

ప్రాణాలను కబళిస్తున్న కాలుష్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని పూలతోట ప్రాంతంలో నిర్వహిస్తున్న అటుకుల మిల్లు నుంచి వెలువడుతున్న వ్యర్థాలు గాలిలో కలసి కాలుష్యం ఏర్పడుతుందని తద్వారా పరిసర ప్రాంతాల వారికి శ్వాసకోస సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయని బాధితుడు మల్లాడి రాధాకృష్ణ తెలిపారు. అటుకుల మిల్లు కారణంగా పగలు, రాత్రి వేళల్లో వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం ప్రభావంతో రోగాలు బారిన పడుతున్నామని ఈ నెల 6న బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు, కాకినాడలోని కాలుష్య నియంత్రణ మండలి, అల్లవరం తహసీల్దార్, గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన నేటికి అధికారలెవ్వరూ స్పందించలేదని బాధితులు వాపోయారు. అటుకుల మిల్లును ఆనుకొని నివసిస్తున్న కుటుంబాల్లో పెనుమాల రాజకుమారి, బిరుదుగంటి రామ్ కుమార్ ఊపిరితిత్తుల వ్యాధితో ఏడాది క్రితమే మృతి చెందారని తెలిపారు. అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన అటుకు ల మిల్లును గ్రామానికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని గాయత్రి, రాధాకృష్ణ, పీవీ రమణ కోరారు.



అటుకుల మిల్లు నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

ఊరు మెచ్చిన మారాజు

- ఆదర్శంగా నిలుస్తున్న ఆటోవాలా నరసింహరాజు
- శ్మశాన వాటికకు పార్థివ దేహాల తరలింపు
- ప్రజా ప్రస్థానం వాహనంతో నిరంతర సేవలు

కాట్రేనికోన: ఓ ఆటోవాలా ప్రజా ప్రస్థానం పేరిట సేవా కార్యక్రమాలు చేపడుతూ ఊరి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు. డా.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న బొమ్మిడి నరసింహరాజు ఊరు మెచ్చిన ఆటోవాలాగా నిలిచాడు. ఐదేళ్ల క్రితం ఊరిలో మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సాయంత్రం వరకు మృతదేహాన్ని ఇంటివద్దనే ఉంచారు. మారుమూల సముద్ర తీర ప్రాంతం కావడంతో ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేని పరిస్థితిలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకరి సలహా మేరకు మృతుడి కుటుంబ సభ్యులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న బొమ్మిడి నరసింహరాజు వద్దకు వచ్చి మృతదేహాన్ని శ్మశాన వాటిక వద్దకు తీసుకు వెళ్లాలని కోరారు. పాసింజర్ ఆటోలో మృతదేహాన్ని తీసుకుని వెళ్లేందుకు అందరిలానే తాను సైతం ఆలోచించి సెంటిమెంట్‌తో తల్లి సత్యవతి, భార్య రామలక్ష్మి సలహా తీసుకున్నాడు. తల్లి, భార్య సలహాతో ఆటో కిరాయికి వెళ్లాడు. దహన సంస్కారం కోసం శ్మశాన వాటికకు వచ్చిన కొందరి మాటలు చెవిన పడటంతో తల్లి, భార్యకు విషయం చెప్పాడు. తీర ప్రాంత గ్రామంలో మృతదేహాలను తీసుకువెళ్లేందుకు ఎవరూ ముందుకురాని విషయం తెలుసుకున్న అతని తల్లి సత్యవతి రాజుకు కొంత ఆర్థిక సాయం అందించి మృత దేహాలను ఉచితంగా దహన సంస్కారాలకు తీసుకుని వెళ్లేందుకు గానూ ఓ ట్రక్ ఆటో కొనేందుకు ప్రోత్సహించింది. అప్పటినుంచి రాజు ప్రజా ప్రస్థానం పేరుతో మృతదేహాలను శ్మశాన వాటికకు తరలిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అర్ధగంట ముందు చెబితే పనులు అన్నీ వదులుకుని ప్రజా ప్రస్థానాన్ని పూలతో అలంకరించి సిద్ధం చేస్తాడు. మూడేళ్ల పాటు గ్రామంలో సేవలు అందించిన వాహనం సముద్ర తీర గ్రామం కావడంతో ఉప్పు గాలికి తుప్పు పట్టి పాడైంది. దీంతో మరో ట్రక్ ఆటో కొనుగోలుకు గ్రామస్తులు రూ.52 వేలు ఆర్థిక సహాయం చేయగా తన దగ్గర ఉన్న రూ.30 వేలు కలిపి సెకండ్ హేండ్ ట్రక్ ఆటోను తీసుకొని సేవలు అందిస్తున్నాడు. గ్రామస్తుల హృదయాల్లో మనసున్న మారాజుగా మారాడు.



ప్రజా ప్రస్థానం వాహనంలో పార్థివ దేహాన్ని శ్మశాన వాటికకు తరలిస్తున్న ఆటోవాలా నరసింహరాజు

సంతృప్తినిస్తోంది



గ్రామంలో మృతి చెందిన వారి చివరి మజిలీలో పార్థివ దేహాన్ని దహన సంస్కారాలకు తీసుకువెళ్లేందుకు నా వంతు సేవను చేస్తున్నాను. పార్థివ దేహాన్ని తీసుకుని వెళ్లే టప్పుడు ఎవరి నుంచి పైసా ఆశించకుండా ఉచితంగా సేవ చేయడం సంతృప్తి నిస్తోంది.

బొమ్మిడి నరసింహరాజు, ఆటోవాలా, పల్లం.